"పోలీసోణ్ణే కూనీ కేసులో యిరికింపెత్తానంటావేట్రా! ఎదవాలోపన్లు పెత్తన్నావ్! అళ్ళ సంగత్తెల్దు నీకు. మీదపడి కుల్లబొడిసెత్తారు. జాగ్రత్త ఎదవవాయాల."

"వాకు సెప్తన్నావా అల్లసంగతి! రత్తమ్మే యస్సైని వుద్దోగం పీకించేసింది. వాకేటి తట్టం."

"ఓరబ్బో, గొప్పలు! ఆ పోకిరీయా?"


# గోతికాడ నక్కలు

## 'చైతన్య'

"మరేటనుకుంతన్నావు? తెల్దు నీకు। యస్సై నాయరుండేవోడు జ్ఞాపకం వుందా? ఆడెక్కడికి పోయేననుకుంతన్నావు? ఊరికి పోయేడను కుంతన్నావా? ఉజ్జోగం పీకేసేరాడికి. ఆడూ యీ పోలీసోడలాగే పట్టుకుంటే వదల్డు. ఆడికి అమ్మాత్త. అన్యా సానాబుద్దులు సదివించేసులే. అయన్నీ నేసుసుకుని పోలీసుజ్జోగం ఏటానికి? పిచ్చనాయాలా। గుళ్ళో పూజారో, ఇస్కూల్లో మాట్టరో అవ్వాల-పోలీసుజ్జోగం ఏట్రా? నవ్వొత్తాది। ఆడినేవోడు కాదు- అద్ది సూసేవు కదా।"

"అః అః! చూసేను చాకులాంటోడు".

"ఏం చాకులాంటోడో! ఓమాపుల రత్తమ్మని పట్టేసేడు। అది పాసింజెర్‌తో వుందియ్యాల. నాయరుగోడు కనిస్టేబుళ్లేసు-




కుని మీదపడితే,అదిబట్టయినా కట్టుకోకుండా "ఎందుకొచ్చారయస్సైగారు" అంది నవ్వుతా కనిస్టేబులు నోరెల్లబెట్టారట। పాసింజరు తప్పతాగున్నాట్ట. అసు తూగుకుంటూ లగెత్తుంటే ఆణ్ణిట్టుకున్నారు. రత్తమ్మని టేసనుకి పదమంటే। తీసికెల్లండి అయ్యగారూ, యిలాగే వచ్చేత్తానందిట! నాయరు బెత్తంతో నాలుగు దెబ్బలేసి ఏసాలెయ్యక పద అన్నాట్ట. రత్తమ్మ గోలెత్తి టేసనుకి పోనాది. దాని డాఫరుగాడు. రత్తమ్మ సిగ్నలు తీస్కుని లగెత్తాడు. రత్తమ్మ ఒల్లూపుకుంటా టేసనుకెల్లేతప్పటికి జామీన్ తయ్యారు. కేసెట్టి జామీను మీద ఒగ్గేట్ట నాయరు. రత్తమ్మ టేసన్నించి ఆయన కాడకి పోయింది. ఆయన ఎవురో తెల్సొగా? కిట్టయ్య- కిట్టయ్య. కిట్టయ్యేమరి పిన్న కమీషనరుగారు! కతేంటో తెల్సొకాని. రత్తమ్మ కన్నెర్రసేత్తే ఒనికిపోయేవోడు. అడికెళ్ళి రత్తమ్మ ఏడిసిందిట. 'ఎటిదంతా' అన్నాట్టాయన.

ఆ రత్తమ్మ కడుపుకాల! ఆ నాయరోడు నన్నట్టుకుని ఉతికేసేడు ఆడుజ్జోగంపీకించక పోతే మీమొగతనవేటి అని తగులుకున్నాది. కిట్టయ్య రెచ్చిపోయేట్ట. నీమీద సెయ్యెయ్య డానికి ఆడికెన్ని గుండెలు' అని పెద్ద కమీషనరయ్యగారి కాడికి పంపేట్ట. ఎల్లి యియన్నీ అయ్యగారికిసూపించు నేనూ ఒత్తా అన్నాట్ట.

రత్తమ్మ నవ్వుతాల కన్నాదేమోనని. నవ్విందట. నవ్వుతాలక్కాదే! ఎల్లు అని తోసేట్ట కిట్టయ్య. రత్తమ్మ సంగతెల్తేటే నీకు పెద్దయగారికాడ సినిమాటారు నాగ ఏడిసిందట.మీపోలీసోళ్లు సంపెత్తున్నారయ్యగారో అని. ఇలా అవుతావుంటే కిట్టయ్య దిగేట్ట."ఇదేటండీ? నాయరుగోడి మీద

కంపేంట్లు ఎక్కువయిపోతున్నాయి. ముండల కొంపలమ్మట దిరిగి దిరిగి ఒప్పు బాకోస్తాన్నిత్తన్నాట్ట. ఇప్పుడేఫోనొచ్చింది. తమరికి మనవి స్టేట్మనొచ్చేను” అని రత్తమ్మన్జూసి “ఇదేటి?” అని అడిగేట్ట. అది సోకిన్నాలెట్టే. కత సెప్పిందిట “నాయరోడు రోజూ గుడిసె మీద పడి రత్తమ్మని సంపుకు తింటన్నాడని. ఆడి కొప్పుకోపోతే



సంపెత్తానంటున్నాడని. ఇయ్యాల తాగొచ్చి తన్ని సితక బాదేసేడని ఆళ్ళోణ్ణే ఎవణ్ణో జైల్లోదాసి. నాపేసింజరని కేసెడతన్నాడని.”

పెద్దయ్యగోరు. “సరే! ఎల్ల”న్నాట్ట. యుద్ధం రత్తమ్మకీ. నాయర్రోడికీ ఏటి? కిట్టయ్యకీ నాయరోడికి మద్దెన లేసిపోనాప. నాయరోడిని సస్పెండు సేయించి. ఆనక ఆడిఉజ్జోగం పీకించే వారకూ కిట్టయ్య నిద్దోలేదు. ఆడిని రత్తమ్మ నిద్దోనియ్య లేదు. ఏతనుకుంతన్నావ్? ఈ ఎదవ పెపంచకంలొ ఎవదెక్కువ ఎదవైతే ఆడి కాడే కూకుంటాడు దేవుడు”.

“నువ్వన్నది సత్తెమేనన్నా! కాని పోలీసోడు పసిగట్టేడంటే పాములా కాటేత్తాడు జార్త”

“సర్లే. సర్లే! పావేసుకుందాం వత్తావేటి? సెంద్రం యిప్పకల్లు తెప్పింసేట్ల”అన్నాడు నరిసిగాడు.

నరిసిగాడు ముందు రోజు రాత్రంతా లాకప్పులో కూర్చున్నాక. ఆనాడు పొద్దున్న మేజిస్ట్రేటు జామీనుమీన విడుదల చేసేడు. వాడిమీద కేసు పెట్టిన పోలీసు తిరపతయ్యని తిరస్కారంగా చూసి నరిసిగాడు బయటికి పోయేడు. రాత్రి 11 గంటలకి తప్పతాగి రోడ్డుమధ్య నిలబడి. పోతున్న ఒకడినిపట్టుకుని. కత్తి చూపించి డబ్బు లాక్కోటోతుంటే. తిరపతయ్య పట్టుకున్నాడు.

“కత్తి సూపిత్తె, బొక్కలో తొయ్యాలేటి? పోడిసేనా? వెర్రిబాగులోడివి తిరపతయ్యా! ఆడి డబ్బు తీసుకోనిత్తే. సగం నీకిచ్చేవోడినికదా” అన్నాడు నరిసిగాడు.

తిరపతయ్య నరిసిగాడిని సాగదీసి చెంపమీద రెండు తగిలించేడు.

“పద కొట్లో తొంగుందిగాని. తెల్లారి తెలివొత్తాది. లేసేక వాగుదిగాని” అని తోసుకెళ్ళి లాకప్‌లో పడేసేడు.

కటకటాల వెనకనించి మేలుకుని వున్నంతసేపూ బూతులు తిడుతూనే వున్నాడు నరిసిగాడు. డ్యూటీలో వున్న పోలీసులు రెండు మూడుసార్లు మరమ్మత్తు చేస్తేగాని వాడి నోరు మూత పడలేదు.

తిరపతయ్య టోపీ తీసి తల గోక్కున్నాడు.

“జన్మంతా ఈ ఎదవలతోనే గడుస్తాది! ఛస్! ఏం బతుకు” అని వుమ్మేడు.

“ఏటి తిరపతయ్యా? ఇలాగ ఆలోసిత్తే యింకేం పోలీసుజ్జోగం” అన్నాడు పక్క

మన్న కానిస్టేబుల్.

"కోడి కూరతిని రెణ్ణెల్లైంది మావాఁ! తెత్తావేటని మాయాడ దంటన్నాది. కోడి తేడానికి డబ్బేది? ఈ దొంగనాయాళ్ళతో రోజంతా సచ్చినందుకు కాత్త బతకడానికి డబ్బు దొరికితే సరుదుకోవచ్చు. అదీలేదు. ఇదీలేదు" అన్నాడు తిరపతయ్య.

"ఇలా గాలోసిత్తే లంచం పట్టాల్నొత్తాది తిరపతయ్యో! మనతో పొద్దు కాడ్నుంచి మాపుటేలరకూ ఈ దొంగనాయాళ్ళే. ఊఁ! అంటే మనకాడికొచ్చి పడినంత డబ్బు ఏ ఉజ్జోగంలోనూ పడదు."

"నరిసిగాడిని సూసేవా? ఆడికి నీతి లేదు నిజాయితీ లేదు. ఆడికి ఇద్దరు పెళ్ళాలు. ఆళ్ళు సాలక. సెట్టిగారి పెళ్ళాన్ని తగులుకున్నాడు. తెలుసున్నా ఆడి కత్తి చూసి సెట్టిగారు నోరు మూసుకుంటాడు. ఆడికి తాగుడుకి. తిండికి డబ్బెక్కడొస్తాది? రాత్తి రవ్వగానే కత్తుచ్చుకుని రోడ్డు మీద నిలబడతాడు. ఆడు దోచేసినోడెవడూ టేసను కొచ్చి కంప్లేంటురాయడు. కోరట్లమ్మట మేవేం తిరగ్గలవంటారు. ఈడిని పట్టుకుని బొక్కలోకి తోత్తే. నాల్రోజుల్లో బయట కొత్తాడు. సాచ్చెందొరక్క. ఈడిబతుకు జరిగిపోతన్నాది దోత్తున్నాడో. కట్టపడి పని సేత్తన్నాడో అనవసరం. ఆడికి దొంగతనం ఉజ్జోగ వయిపోయింది. "బతికినంతకాలం బతుకుతాను. తరువాత సత్తాను. ఏటయింది యిలాగుంటే?" అంటాడు దొంగనాయాల. ఈ ఎదవ డబ్బున్నరోజు మంచి బట్టలేసుకుని పెద్ద హొటేలులో తింటాడు- రాజాలా తిరుగుతాడు. దొరకనిరోజు యిలా జైలులో తొంగుంటాడు. ఈడిలాంటోళ్ళ గురించి సెపితే.మా యింటి పక్క యిస్కూలు మేట్టరు "ఆడికి ఏదో రోజు తప్పు తెలిసి బాధ పడతాడు. అదే ఆడికి సిచ్చ"అంటారు. ఏటో గోల! అది సిచ్చయితే దొంగతనం-పరవా లేదనిపిస్తది" అని నవ్వేడు తిరపతయ్య.

మర్నాడు సాయంత్రం తిరపతయ్య యింటికెళ్ళేటప్పటికి. అతనిభార్య కోడి వెంట్రుకలు పీకుతూ కనబడింది.

"ఏటిసేసం? కోడెలా వొచ్చిందేటి?" అన్నాడు తిరపతయ్య.

"ఏం సరసం! నువ్వు పంపిందే. నే వేరే కొండానికి డబ్బెక్కడిత్తావ్?"

"నేం పంపడవేటీ? ఏ ఎదవ సెప్పేడు?"

"బావుందయ్యోయ్! ఎవురో అబ్బాయి తెల్లసొక్కాలో వొచ్చాడు. తిరపతయ్య యిమ్మన్నాడని కోడినిచ్చి పోయాడు. నాకేం దెలుసు నువు పంపలేదని."

"ఊరుకోహె! ఎదవ మొగం! ఎలాగున్నా డొచ్చినోడు?"

"పోలీ సనిపించు కున్నావ్. ఎలావున్నాడంటే ఏం తెలుస్తది? కుర్రోడిలాగే వున్నాడు."

"ఎదవకోడి నవతలపారెయ్! ఏ నంజకొడుకు పంపేడో?"

"ఎందుకలా తిడతావ్? కోడేగా పంపేడు ఇసం కాదుగా!"

"చంపుతా! నాయాల! కోడవతల పారెయ్."

"ఏం మనిసివయ్యా! పోలీసోల్లందరూ నీలాగే వున్నారా? నువ్వు చస్తవు నన్ను జంపుతవు."

తిరపతయ్య చెయ్యెత్తి భార్యవైపు వెడితే.

"సర్లే! కూకో! పారేత్తన్నా" అని గుడిసె పక్కకెళ్ళి పక్కింటి యిల్లాలికి యిచ్చింది కోడిని.

"మీరు తినరా?" అని అడిగింది పక్కింటావిడ.

"కోసేసినాక సెప్పేడు. ఈనకీ వంట్లో బావులేదు. నాకూ లేదు" అంది తిరపతయ్య భార్య.

పక్కింటావిడ కోడిని ఆనందంగా తీసుకుపోయింది.

తిరపతయ్య రాత్రంతా ఆలోచిస్తూనే వున్నాడు.

మర్నాడు తిరపతయ్య డ్యూటీలో వుండగా కొండన్న రిపోర్టు రాయించడానికొచ్చేడు.

తోడు 25 ఏళ్ళ ఆడమనిషిని తీసుకొచ్చాడు

"ఏటయిందేటి "అన్నాడు తిరపతయ్య.

"నరిసిగాడు మా పేణాలు తోడెత్తన్నాడు బాబూ. తవరు రచ్చించాల. నా తమ్ముడు గౌరన్నని తవరెరుగుదురుగదా! గోవులాంటోడు. నరిసిగాడు తాగొచ్చి గౌరన్న నెత్తి మీద కూకుంటన్నాడు. అయిదొందలు కావాలటాడికి నా తమ్ముడేడనించి తేగల్డు బాబూ! ఆడు సచ్చీ సచ్చీ నాలు గొందలు పోగోసి దీనికి బంగారం సేయించిచ్చేడు. ఇది గౌరన్న ఆడది బాబూ? లచ్చీ. బాబుగోరికి మొక్కవే." లచ్చి తిరపతయ్యకి చేతులు జోడించింది. "ఆ బంగారవియ్యమని కూకున్నాడు బాబూ. నాలుగేల్ల ఎనక నరిసిగాడు రెండొందలు గౌరన్నకిచ్చేట్ట. అది యీడు తిరిగిచ్చేసినోడు. నరిసిగాడు నీ యవసరానికి నే నిచ్చా! నా యవసరానికి నువ్వియ్యవా?" అని కూకున్నాడు. నరిసిగోడి గురించి తవరికి తెలస్తేవుంది. ఆడికి డబ్బిత్తె తిరిగి రాదు బాబూ. డబ్బియ్యకపోతే సంపెత్తానంటున్నాడు. ఈ మాట తవరికి మనవిసెయ్యమని గౌరన్నకి సెపితే 'పోలీసులకాడి కెందుకన్నా' అంటాడయ్యా. ఆ నరిసిగాడు రెండు మూడు సార్లొచ్చి యీ యాడకూతుర్ని బెదిరించేడు. చెరిచేత్తానంటాడు సిగ్గు మాలినోడు. రిపోర్టు రాయింసండి బాబు" అన్నాడు గౌరన్న.

"ఆడితో మాట్టాడ నీ కొండన్నా. ఎదవకి నాలుగు తగిలిత్తె నోరు మూసుకుంటాడేమో."

"తవరిట్టం బాబూ! ఆడినెలాగయినా యీ యాడకూతురునించి దూరంగా వుంచండి బాబు. సచ్చిపోతాది. నే పోతే" అని ఏడిచేడు కొండన్న.

వెడుతూ వెడుతూ కొండన్న యింకో మాటన్నాడు "నరిసిగాడికి తవరంటే కిట్టదయ్యా. తవర్ని లంసం పెట్టి కేసులో యిరికిత్తానట్ట తవరింటికి కోడిని పంపేట్ట. వూరంతా కూత్తన్నాడు"

తిరపతయ్య నవ్వేడు.

"పొద్దుగూకేక డూటీ నించి కొంపకి బోతూ వత్తాలే. గౌరన్నతో మాట్టాడి. నరిసిగాడిని మరమ్మత్తు సేత్తాను" అన్నాడు తిరపతయ్య.



# మందార మకరందాలు

## లోక వ్యవహారం

వేనకేనా ప్యుపాయేన.బై హుక్ అర్ బై క్రూక్. ఒక బహుమానం కొట్టెయ్యాలని. బిరుదు సంపాదించాలని. గోల్డ్ మెడల్ సంపాదించుకోవాలని ప్రాచీనకాలం నుంచి మానవుడు యత్నించాడు. చాలాసార్లు సాఫల్యం పొందాడు. వైఫల్యమూ పొందాడు. అయినా ఉప్పుదారినో పప్పుదారినో గమ్యం చేరే ప్రయత్నం మాత్రం మానలేదు. అందుకు కారణం ఉంది. ఏమిటంటే :

జనం జనపదా నిత్య మర్చయంతి
నృపార్చితమ్
నృపేణావమతో యస్తు స సర్వై
రవమన్యతే॥

పండితుడనో. కవి అనో. ఘనుడనో. వీరుడనో బహుమానం పొందినవాణ్ణే రాజ ముద్రతో సత్కరింపబడినవాణ్ణే జనమూ జనపదమూ కూడా గౌరవిస్తుంది. సిమెంటు కోటాను గాని. మెడికల్ సీటుగాని రిపబ్లిక్ డే అవార్డు గాని సంపాదించలేకపోయినవాణ్ణి అవమానిస్తుంది.

అయితే అలాటి అవమానకర పరిస్థితి వచ్చినప్పుడల్లా ఆ ఓడిన వాళ్ళంతా ఆత్మహత్య చేసుకుంటారా?ఇంకేదో మాట చెప్పి జనం మళ్ళీ తమను కూడా ఆదరించేందుకు యుక్తులు పన్నుతారు. అలాంటి యుక్తే—

ముకుటే రోపితః కాచః చరణా భరణే
మణిః॥
నహి దోషో మణే రస్తి సతు రాజ్ఞోహ్య
విజ్ఞతా॥

గాజుముక్కను నెత్తిన పెట్టుకుని మణిని కాలికి వేలాడకడితే.ఆ తప్పు మణిది కాదు. గుణదోషాలు తెలుసుకోలేని ఆ రాజుది.

ఆ రోజుకి అలా తప్పించుకోడంతో కొంత బైటపడి ఊపిరి పీల్చుకుంటాడా మానవుడు.

—సౌభరి

---

కొండన్న. లచ్చిని తీసుకుని వెళ్ళిపోయేక. ఇంకో కానిస్టేబిల్ తిరపతయ్యని తిట్టేడు.

"నీకు తెల్దేటి తిరపతయ్యా ? ఆ యాదదేం తక్కువదేటి ? దానికి కొండన్నతో సంబంధం వుందంటారు. ఆడు దీన్నేసుకొచ్చి ఈడ సోకన్నా లెడితే నీ బుద్దేవయిందో? దాన్ని సూసి పరుగులెడతన్నావేటి?"

"పరాసికాలాడకో! నరిసిగాడెంత ఎదవో నీకు తెల్దా? రెండ్రోజులక్రితం నా ఇంటికి ఎవుడో కోడిపంపితే 'ఎవరా?' యని ఆలోసించేను. పంపిం దీడన్నమాట. ఆడికి బుద్ధి సెప్పకపోతే యింకేం సేత్తాడో? మా యాడదాన్ని తిట్టి కోడి పారేయించేను. ఏం గోలో. ఎదవుదో గం ! నాయంగా బతకనియ్యరు నాయాళ్ళు" అన్నాడు తిరపతయ్య. అన్నాడుకాని. లచ్చిని చూసేక తిరపతయ్య రక్తం వేగంగా పరుగులు తీసింది. "సక్కగా వుంది. పైగా వుషారుగా వుంటాదిట" అని పెధవాలోచన వచ్చింది. తల విదిల్చి ఆలోచనల్ని పక్కకి తోసేసేడు.

తిరపతయ్య సాయంత్రం గౌరన్న గుడిసె దగ్గర కెళ్ళేటప్పడికి. జనం పోగయి వున్నారు నరిసిగాడు తాగి అరుస్తున్నాడు. వాడిని నలుగు రైదుగురు పట్టుకుని ఆపుతుంటే గౌరన్నమీద పడ్డానికి ముందుకి దూకుతున్నాడు. లచ్చి దూరంగా నిలబడి చూస్తోంది. చుట్టూ గుడిసెల మధ్య నించి ప్రవహిస్తున్న కుళ్ళు నీళ్ళల్లోంచి పందులు పరుగెడుతుంటే.దోమలు ఎగిరి తిరపతయ్య చుట్టూ తిరుగుతున్నాయి. తిరపతయ్య "లెగండి. లెగండి" అని జనాన్ని తప్పించుకెళ్ళి నరిసిగాడి గొంతట్టుకున్నాడు. తిరపతయ్యని చూడగానే. ఒక్కసారి లచ్చి విజృంభించింది. "ఇప్పుడు రారా. నరిసి నంజకొడకా : సెప్పేవోల్లులేక పేలిపోతన్నవు. నామీద సెయ్యేత్తే పేణాలు తోడెత్తాను జాగరత. నీ యబ్బసొమ్ము దాసేవ్రటా నాకాడ ? గౌరన్న గోవులాంటాడని నాకాడ ఎగురుతున్నావా?" అని చేతులెగరేసింది.

నరిసిగాడు కళ్ళల్లోంచి నిప్పులు కురిపించేడు. "గౌరన్న గోవయితే నేంటే? నీకో కొత్త మొగుడు దొరికేడు గదే, ఆడుంటే ఇక నీకేటి భయం — విన్నుసూ త్తన్నా. తిరపతయ్యని తగులుకున్నాక సోకులెక్కువయ్యాయి. ఏం తిరపతయ్యా! రిపోర్టు ఎక్కించకుండానే వాచ్చేసావు?" తిరపతయ్య నరిసిగాడిని ఎడాపెడా వాయించి బాగా తన్నేడు. కుళ్ళు గోతులో పడ్డ నరిసిగాడు లేచి బూతులు తిడుతూ. తూలుకుంటూ పోయేడు.

అందరూ తిరపతయ్యకి దండాలెట్టేరు. "ఆ యెదవ గూడెంలో గొడవపెయ్యకుండా తవరే సూడాల" అన్నారు.


లచ్చి రెండు చేతులూ జోడించి తిరపతయ్యకి పెయ్యట్టుకుని "గుడిసెలోకి వదండి బాబు. తవరికి టీ నీల్లిత్తా. ఎదవనాకొడుకు పేణాలు కొరుక్కు తినెత్తన్నాడు. రచ్చించేరు" అంది.

గుడిసెలో కెడుతుంటే. గుమ్మంలోంచి ఒకేసారి వెల్లడానికి ప్రయత్నిస్తుంటే. తిరపతయ్యకి. నమస్కారం చేసింది. తిరపతయ్యకి లచ్చి శరీరం దగ్గరగా నొక్కుకుంది. తిరపతయ్య నరాలుజివ్వుమన్నాయి. వాళ్ళ వెనకే. బయటనున్న గూడెంలోని నలుగురు మనుషులు కూడా లోపలకొచ్చేరు. అందరూ టీ తాగేక :

"రెండు రోజులకోసారి మమ్మల్ని సూసి పొండిబాబూ" అని చేతులెత్తి నమస్కారాలు పెట్టేరు లచ్చి. గౌరన్న.

తిరపతయ్య రెండురోజుల కోసారిచూసి పోతూ వుండేవాడు. లచ్చి కొద్దిగా అక్కడా యిక్కడా తిరపతయ్యని దేవుడిలా చేసి మాట్లాడుతుంటే పరాచికాలాడేవంతా "పోలీసయ్య ఎంటపడ్డావేటే?" అని.

లచ్చి సిగ్గుపడింది. "మీలాంటోల్లు పది



మంది కంటే ఆయనొక్కడుంటే సాల్దేటి. రౌడీ ఎదవల్ని దులిపేత్తాడు" అనేది.

తిరపతయ్య చనువుగా వుంటే చూసి 'మంచోడేకదా! దానికీ మనసయింది గౌరన్నకి లేని ఎదవగోల మనకేటి? పోనీం డెహె' అనుకున్నారు. లచ్చికీ. తిరపతయ్యకీ మధ్య ఏదో కథ జరుగుతోందేమోనని అనుమానించిన వాళ్ళుకూడా !

* * *

ఆరోజు రాత్రి 12 గంటలకి. వూరు మాటుమణిగిన తర్వాత లచ్చి జుట్టు విరగబోసుకుని గావుకేక లెట్టటం మొదలెట్టింది. గూడెంలో అందరూ లేచి లచ్చిని గట్టిగా పట్టుకున్నారు.

"ఓలమ్మో! నే సచ్చిపోయేనే! గౌరన్నని సంపేశారు బాబో! బంగార మెత్తుకపోయేరో" అని తల బాదుకు ఏడుపు మొదలెట్టింది.

అంతా గుడిసెలోకి చూస్తే గౌరన్న రక్తం కారుతున్న తలతో చచ్చి పడున్నాడు.


"అన్నా! ఆ నరిసిగాడిని పట్టుకోండి! ఎదవ సంపేసేడు సివరకి" అంది.

"నువ్వేడికి పోయేవే?" అన్నారు కొందరు.

"అయన్నీ తరవాసెప్తా ! నేను బయటకి పోయి వచ్చేకాడికి యీడిబుర్ర బద్దలు కొట్టి, పెట్టె తెరిసి బంగారమెత్తుకపోయేరు. ఎల్లండి బాబూ. తొందరగా ఎల్లి ఆ నరిసిగాడిని పట్టుకోండి" అని శోకాలెట్టింది లచ్చి.

నరిసిగాడికోసం వెతకడానికి కొందరు పరిగెడితే. కొందరు పోలీసుస్టేషనుకి పరుగెత్తేరు. స్టేషనుకెళ్ళిన మనుష్యులు డ్యూటీలోవున్న తిరపతయ్యని తీసుకుని పరిగెత్తు కొచ్చేరు.

"నరిసిగాడేం సేయనేదే. ఆడు సాయంత్రంనించి లాకప్పులో వున్నాడు" అన్నాడు తిరిగివచ్చిన వాళ్ళల్లో ఒకడు.




లచ్చి స్థాణువులా నిలబడింది. తిరపతయ్య దగ్గరకు రాగానే అతని చొక్కా పట్టుకుంది. "నీకేం పొయ్యేకాలం వచ్చిందిరా? బుద్ధి గడ్డి తిన్నందుకు నాకిలా అవ్వాలసిందే. కావాలంటే నేను కూడా నీకాడ పడుక్కున్నాను. బంగారం కావాలంటే యియ్యలేదని గోవులాంటోడు మావని సంపెత్తావురా!" అని తిరుపతయ్య మొహం మీద ఉమ్మింది. తిరుపతయ్య బుర్ర గిర్రున తిరిగింది.

గూడెంలో మనుష్యులు షాక్ తిన్న వాళ్ళలా అయి. ఒక్కసారి తిరపతయ్య మీద పడ్డారు. తిరపతయ్య మీద జాలి వున్న ఒకళ్ళిద్దరు పరుగెత్తుకెళ్ళి స్టేషనులో చెప్పి. పోలీసుల్ని తీసుకురాకపోతే. ఆ రోజు తిరపతయ్య బతికి బయటపడ్డం కష్టమయిపోయేదేమో. గూడెం మనుషులు "తిరపతయ్య పేణాలు మాక్కావాల" అని అరుస్తుంటే పోలీసులు అతన్ని తీసుకుపోయేరు.

తిరపతయ్య మీద కేసు నడిచింది. అతనికి ఎదురుగా సాక్ష్యం చాలా బలంగా వుంది. మర్డరు జరిగిన సమయంలో స్టేషను నించి తిరపతయ్య బయటకు వెళ్ళేడని చెప్పేరు. స్టేషనులో అతనితో డ్యూటీలో వున్న కానిస్టేబిల్సు. నేను బయలు ప్రదేశానికి పోవాలని బయట కెళ్ళేనన్నాడు తిరపతయ్య. "రంకాడినోడు బొంకాడ్డా" అన్నారంతా. "నాకేం తెలియ"దని మొత్తుకున్నాడు తిరపతయ్య.

కేసు హియరింగ్ మొదలయిన పదిహేనవ రోజున. కొండన్న కత్తి పుచ్చుకుని పోలీసు స్టేషనులో కొచ్చాడు. అతని వంటి నిండా రక్తం. కళ్ళెర్రగా వున్నాయి. కొండన్న చెప్పినది విని. పోలీసులు అతని స్టేట్‌మెంటు రికార్డు చేసేరు.

"రత్తి పడుకున్నది నాకాదే ననుకున్నాను బాబూ. దాని మాటయిని. దానెదురుగానే గోవులాంటోడు మాతమ్ముడిని సంపేసేను. అది. ఆ కేసు తిరపతయ్య మీదకి తిప్పితే "నాకోసమేగదా యిదంతా సేత్తంది" అనుకున్నాను. ఆ రోజు నరిసిగాడు లాకప్పులో కూకోడం కూడా ఆల్లిద్దరూ కలిసి ఏసిన ప్లానేననీ, నరిసిగాడితో కల్సి యిది నాటకమాడతందని ఈ రోజు వరకూ తెలిసిందికాదు. బంగారం తీసుకుని. నరిసిగాడితో కలిసి పారిపోతంటే దాన్ని బట్టుకు బొడిసీసేను. ఆడు పారిపోయేడు. ఆడిని పట్టుకోండి బాబూ."

* * *

విడుదలయిన రోజున తిరుపతయ్య గుడికెళ్ళేడు. వెంట్రుకవాసిలో తప్పిపోయిన ఉరిశిక్ష జ్ఞాపకం వచ్చినప్పుడల్లా "ఎదవ డూటీ" అని విసుక్కుంటూ తిరపతయ్య. ●


## ఇది మీకు చాలా ఉపయోగం

మీకు 'వ్యవహారదర్శిని' అనే తెలుగుపుస్తకం చాలా ఉపయోగం. అందులో ఆస్తికొన్నా అమ్మినా తేసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాపార, పరిశ్రమలకె లాంటి లైసెన్సులు తీసుకోవాలి, అన్నిమతాల వివాహ, విడాకుల నిబంధనలు స్త్రీపురుషుల ఆస్తిహక్కులు, చెడ్డవారితో ప్రమాదం రాబోతే పోలీసురక్షణకు ఎవరికెలా వ్రాయాలి, ఇండ్లస్థలాలకెలా ధరఖాస్తు పంపాలి, లాడ్జింగుల్లో వ్యభిచారనిరోధరూల్సు, వాటినుంచి రక్షణవివరాలు, మీరుతెలుసుకోదగిన అనేక చట్టాలవివరాలు, నోట్సు, దస్తావేజులు, ఒప్పందాలు, పిటీషన్లు, ఫిర్యాదులు ఉత్తరాలు ఎలావ్రాయాలి, వాటివివిధ నమూనాలు అందున్నాయి. సుమారు 300 పేజీలపుస్తకం. ధర రూ॥12. వి.పి. పోష్టుఖర్చు రూ॥3. అదనం. దేశసేవ ప్రచురణలు, నెం.2, ఇందిరానగరు, వెంగలరావునగరు టాంకుసమీపాన హైదరాబాదు-500890కు, మీఉపయోగానికి వ్యవహారధర్మిని పుస్తకం ఒకటి వి.పి. పోష్టుద్వారా మీకు పంపించమని నేడే ఉత్తరం వ్రాయండి.

